సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



భవితకు పునాది

ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తోంది.


8లో



కమనీయం.. బ్రహ్మోత్సవం

వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. మంత్రోచ్ఛారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది.

39వేల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 39,347 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 7,800 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఆధునికత పేరుతో ఆచారాలు వదలొద్దు

ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి



తాళ్లపూడిలో ప్రసంగిస్తున్న గరికపాటి నరసింహారావు

తాళ్లపూడి: ప్రస్తుత సమాజంలో ఆధునికత పేరుతో ఆచార, సంప్రదాయాలను వదిలిపెడుతున్నారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచర కర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం శత చండీ యాగం మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆమర ప్రవచన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అహంకారం ఉండరాదని, ఉన్న దానితోనే సంతృప్తి చెందాలన్నారు. పిల్లలను సరైన మార్గంలో పెంచాలని హితవు పలికారు. ప్రతి వ్యక్తిలో దైవం ఉన్నాడని చెప్పిన ఏకైక మతం హిందూ మతమని చెప్పారు. ఆధ్యాత్మిక యాత్రలు చేయడం కాదని, మనలో మార్పు రావాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆయనను సత్కరించారు.

హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం సిటీ): చారిత్రక రాజమహేంద్రవరంలో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రతినిధులు గొట్టిముక్కల అనంతరావు, అల్లంకి శివప్రసాద్, బీర అరుణ్‌కుమార్, కుంచె రాంబాబు, దీపాటి శ్యాంబాబు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఎం.సుజాతకు వినతిపత్రం అందించారు. అనంతరం సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలో రోడ్డు, రైలు, వాయు రవాణా మార్గాలు అందుబాటులో ఉన్నాయని, విస్తారమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు, న్యాయవాదులు హైకోర్టులో కేసు వేయాలంటే అమరావతి వెళ్లాల్సి వస్తోందన్నారు. హైకోర్టు బెంచ్ రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తే, ఆయా జిల్లాల ప్రజలకు, న్యాయవాదులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

రాజమహేంద్రవరం సిటీ: దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తగా ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి నడిచే సుమారు 20 రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు చెప్పారు. ఆయా రైళ్లలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు పూర్తి సొమ్ము వాపసు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రద్దయిన రైళ్ల వివరాలను ప్రయాణికులు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జల సమరం

- సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం శ్రీకారం
- ఈ నెల 31న నోటిఫికేషన్
- వచ్చే నెల 21 నుంచి ఎన్నికలు
- 'తూర్పు'లో 113 నీటి సంఘాలకు పోరు
- ఎన్నికల నోటిఫికేషన్–1 వెలువరించిన కలెక్టర్
- తొలుత టీసీల ఎంపిక.. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక
- ఆపై డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అవకాశం
- ప్రస్తుతం తూర్పు, మధ్య డెల్టాలకు వేర్వేరుగా సంఘాలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు తెర లేచింది. ఆయా ఆయకట్టు పరిధిలో సభ్యుల ఎంపికకు ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు విడివిడిగా నోటిఫికేషన్లు వెలువరించారు. ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియ వచ్చే నెల 29వ తేదీ నాటికి ముగియనుంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగం తలమునకలైంది.

సాక్షి, రాజమహేంద్రవరం: ఆయకట్టు పరిధిలో సంఘాలు కొలువు దీరితే కాలువల నిర్వహణ, నీటి వినియోగం, తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టడం లాంటి కార్యక్రమాలు సులభతరం కానున్నాయి. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 113 నీటి సంఘాలకు ఎన్నిక నిర్వహించేందుకు కలెక్టర్ పి.ప్రశాంతి నోటిఫికేషన్–1 జారీ చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ప్రతి మండలానికి నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ) పరిధిలో తహసీల్దార్‌ను అథరైజ్డ్ అధికారిగా నియమించారు. ఆయకట్టు వివరాలు చూసేందుకు నీటి పారుదల శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించారు.

పదవుల పందేరం

సాగునీటి సంఘాల ఎన్నికలతో పదవుల పందేరానికి తెర లేచింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ విజయానికి కృషి చేసి, నామినేటెడ్ పదవుల ఎంపికలో భంగపాటుకు గురైన నేతలకు ఇందులో అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఈ మేరకు టీడీపీ నేతలు కసరత్తు మొదలు పెట్టినట్టు సమాచారం.

ఎన్నిక ప్రక్రియ ఇలా..

కాలువల ఆయకట్టును ప్రామాణికంగా తీసుకుని తొలుత ఆయా ప్రాంతాల్లో ప్రాదేశిక నియోజకవర్గం (టెరిటోరియల్) వారీగా ఆయకట్టు, ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు. అనంతరం 12 మంది టీసీల(టెరిటోరియల్ సభ్యులు)ను ఎన్నుకుంటారు. వీరు నీటి సంఘాల అధ్యక్ష(డబ్ల్యూయూఏ), కార్యదర్శులను ఎన్నుకుంటారు. డబ్ల్యూయూఏలు (డీసీలు), డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు. గోదావరి డెల్టా పరిధిలో గతంలో ఒకటే కమిటీ ఉండేది. ప్రస్తుతం దాన్ని తూర్పు డెల్టా, మధ్య డెల్టాలకు వేర్వేరుగా విభజించి ఎన్నిక నిర్వహించనున్నారు.

ఉమ్మడి 'తూర్పు'లో ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గోదావరి డెల్టా సిస్టం, ఏలేరు ఇరిగేషన్ డివిజన్, ఏలేరు ప్రాజెక్టు, తొర్రిగెడ్డ పంపింగ్ స్కీం, పంపా రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 401 సాగు నీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 5 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి.

వాటి వివరాలు ఇలా..

గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఎస్): మధ్య డెల్టాలో సాగు నీటి వినియోగదారుల సంఘాలు(డబ్ల్యూయూఏ)లు 56 ఉన్నాయి. తూర్పు డెల్టాలో 74 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలున్నాయి. ఏలేరు ప్రాజెక్టు పరిధిలో 25 సంఘాలు, 5 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉంది. తొర్రిగెడ్డ పంపింగ్ పథకంలో 4 వినియోగదారుల సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ, పంపా రిజర్వాయర్ 6 సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు పరిధిలో 6 సంఘాలు, ఒక కమిటీ ఉంది.

తూర్పులో షెడ్యూల్ ఇదీ..

- నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్–1 సోమవారం విడుదలైంది.
- ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల వివరాలు ప్రచురిస్తారు.
- నవంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- 31వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాల ప్రచురణ చేపడతారు.
- వచ్చే నెల ఒకటి నుంచి 2 వరకు ప్రాదేశిక నియోజకవర్గాల అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- 3వ తేదీ: ప్రాదేశిక నియోజకవర్గాల అభ్యంతరాలపై నిర్ణయం, తుది ప్రచురణ.
- 6 నుంచి 10వ తేదీ: భూ యాజమానుల ఓటరు జాబితా తయారీ
- 11 నుంచి 12వ తేదీ: భూ యాజమానుల ఓటరు జాబితాలపై అభ్యంతరాలు
- 13వ తేదీన భూ యాజమానుల ఓటరు జాబితాల అభ్యంతరాలపై నిర్ణయం
- 20న తుది ఓటరు జాబితా ప్రకటన. ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికల ప్రకటన
- 21 నుంచి 23వరకు ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాలకు ఎన్నిక నిర్వహిస్తారు.
- 24 నుంచి 26 వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పోలింగ్
- 27 నుంచి 29 వరకు ప్రాజెక్టు కమిటీల పోలింగ్

ప్రజల్లో విశ్వసనీయతను పెంచాలి



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు (అంతరచిత్రం) మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

- పోలీసులకు ఎస్పీ నరసింహ కిశోర్ సూచన
- జిల్లా నేర సమీక్ష సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అప్పుడే పోలీసు వ్యవస్థపై విశ్వసనీయత పెరుగుతుందని చెప్పారు. ప్రతి నెలా జరిగే నేర సమీక్షా సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. తీవ్ర కేసుల దర్యాప్తుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులను గడువులోగా, చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు. బహిరంగ మద్యపానం, డ్రంక్అండ్‌డ్రైవ్‌పై ముమ్మర తనిఖీలు చేపట్టి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాష్, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డయల్ 112కు వచ్చే కాల్స్‌కు తక్షణం స్పందించాలన్నారు. గంజాయిని అరికట్టేందుకు దాడులు చేసి, స్మగ్లర్లను అరెస్టులు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రజల సహకారంతో అరికట్టే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులపై అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

పటిష్టంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు క్షేత్ర స్థాయిలో మరింత కృషి జరగాలని కలెక్టర్, టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా బాల కార్మిక వ్యవస్థ అంతర్లీనంగా ఉందన్నారు. బాల కార్మికులు లేకుండా చేయడంలో మరింత జాగురుకతతో కమిటీ వ్యవహరించాల్సి ఉందన్నారు. ఆ మేరకు ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. భిక్షాటన, చేపల చెరువులు, హోటళ్లు, హైవే ధాబాలు, కంపెనీలు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు తదితర చోట్ల బాల కార్మికుల ఉనికిని గుర్తించమన్నారు. పలు సందర్భాల్లో బాలకార్మికులను గుర్తించిన దుర్బల ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత యాజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, నిఘా ఉంచాలన్నారు. పిల్లల రక్షణ కమిటీ ఆధ్వర్యంలో వైద్యాధికారుల సమక్షంలో వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఇప్పటికే పోలీసుల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సీసీ కెమేరాలతో నిఘా పెట్టినట్టు తెలిపారు. బాల కార్మికులు తారసపడితే ప్రజలు జిల్లా యంత్రాంగం దృష్టికి తేవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ లేబర్ కమిషనర్ బీఎస్ఎం వలి తెలిపారు. ఇందుకు 94925 55064, 94925 55065, 94925 55066 ,94925 55067 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంతకుముందు కలెక్టర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులపై దృష్టి

పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార సవాళ్లను ఎదుర్కోవడానికి సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 సమీకృత పోషకాహార మద్దతు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 2024–25 అమలు తీరుపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతుల కల్పన కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సక్షం పథకం కింద కేంద్ర నిధులు విడుదల అయ్యాయన్నారు. 2024–25లో చక్కటి ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఐసీడీఎస్, ఇతర సమన్వయ శాఖలు, ఇంజినీరింగ్ విభాగం అందజేసే ప్రతిపాదనలకు నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ కె విజయకుమారి మాట్లాడుతూ, జిల్లాలో 704 అంగన్‌వాడీలకు సొంత భవనాలుండగా, 115 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 39 కేంద్రాల్లో తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కూటమి అండగా.. అనుచితంగా..

- గోదావరి పరివాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ నిల్వలు
- ర్యాంపులు మూస్తే.. అధిక రేట్లకు విక్రయించేలా ఏర్పాట్లు
- ఉచితంలోనూ.. యూనిట్ రూ.500పైగా వసూలు
- రాత్రయితే టిప్పర్లలో దూర ప్రాంతాలకు తరలింపు
- కళ్ల ముందే గుట్టలు కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు



నిడదవోలు మండలం పెండ్యాల ర్యాంపులో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు



నిడదవోలు మండలం జీడిగుంటలో ఉచిత ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు

నిడదవోలు రూరల్: గోదారి తీరంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ ఇసుక నిల్వలు చేసి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ నిల్వదారులకు కూటమి నేతలు వత్తాసు పలుకుతున్నారు. అధికారుల కళ్లముందే అక్రమ ఇసుక గుట్టలు కనిపిస్తున్నా.. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో చూసీచూడనట్టు వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తప్పు చేసిన వారిని వదిలేయడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో గోదావరి తీరంలో ఎడాపెడా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

నిడదవోలు మండలంలోని పెండ్యాల కేంద్రంగా పలు గ్రామాల్లో పట్టపగలే గుట్టలు గుట్టలుగా ఇసుకను నిల్వ చేస్తున్నారు. భవిష్యత్తు అవసరాల కోసం కొనుగోలు చేసేవారితో పాటు ర్యాంపులు మూసివేస్తే.. వచ్చే కొరతను దృష్టిలో ఉంచుకుని అక్రమార్కులు ఈ నిల్వలను చేస్తున్నారు. అధికారులు మాత్రం కూటమి నేతల ఫోన్‌కాల్స్‌కు బెదిరిపోయి.. ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు.

తక్కువ ధరకు కొని..

ఉచిత విధానంలో తక్కువ ధరకు ఇసుకను కొని, నిల్వ చేసి అధిక రేట్లకు విక్రయించేలా అక్రమార్కులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉచిత ఇసుకను ట్రాక్టర్ల సాయంతో రవాణా చేసి, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా నిల్వ చేస్తున్నారు. నిడదవోలు మండలంలోని పెండ్యాలలో సుమారు 40 నుంచి 50 వరకు అక్రమ స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఇవేకాక విజ్జేశ్వరం, రావివారిపాలెం, పందలపర్రు, డి.ముప్పవరం గ్రామాల్లో ఇసుక నిల్వలు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. సహజంగా ఇల్లు కట్టుకునే వారికి పది నుంచి 20 లారీల ఇసుక అవసరమవుతుంది. అయితే వందలాది ట్రాక్టర్ల ఇసుకను నిల్వ చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు.

అద్దె ట్రాక్టర్లతో..

ప్రస్తుతం ర్యాంపులో నుంచి ఇసుక తరలించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి నేతల అండదండలతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అద్దెకు ట్రాక్టర్లు తెచ్చి, పెండ్యాల, పందలపర్రు జీడిగుంట గ్రామాల్లో డంప్ చేస్తున్నారు. గోదావరి ఇసుకంటే గృహ నిర్మాణదారులకు మక్కువ కావడంతో, ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు రూ.వెయ్యి అద్దె చెల్లించి రోజుకు కనీసం పది ట్రాక్టర్ల ఇసుకను ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

ఎవరైనా అక్రమంగా ఇసుక నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ర్యాంపుల వద్ద ట్రాక్టర్లలో ఇసుకను కూలీలే లోడింగ్ చేస్తున్నారు. ఆ ఇసుకను గృహ నిర్మాణాలకే వినియోగించాలి. అధిక ధరలు వసూలు చేసినా, ఇసుక స్టాక్ పెట్టినా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– బి.నాగరాజ్ నాయక్, తహసీల్దార్, నిడదవోలు

అక్కడ నుంచి పొక్లెయిన్ సాయంతో లారీల్లో ఇసుకను లోడ్ చేసి, రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. క్వారీ లారీకి రూ.10 వేలు, టిప్పర్ లారీకి రూ.10 వేలకు పైనే అధిక ధర వసూలు చేసి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు.



పెండ్యాల శివారులో రైతు సేవా కేంద్రం వద్ద ఇసుక అక్రమ నిల్వ

కూలీల కష్టం దోపిడీ

ఇలాఉండగా కూలీల రెక్కల కష్టాన్ని సైతం కూటమి నేతలు వదలడం లేదు. ర్యాంపుల్లో ఇసుక తవ్వేందుకు యంత్రాలకు అనుమతులు లేకపోవడంతో.. జిల్లాలోని ప్రధాన ర్యాంపుల్లో కూలీలే ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. నిడదవోలు మండలంలోని పెండ్యాల, జీడిగుంట, రావివారిపాలెం, పెరవలి మండలం తీపర్రు ఇసుక ర్యాంపుల్లో కూలీలే ఇసుక లోడ్ చేస్తున్నారు. కూటమికి చెందిన మంత్రి, మాజీ ఎమ్మెల్యే అనుచరులు చెప్పినట్టు వింటేనే వీరికి పని ఉండేది. లేకపోతే ర్యాంపు మూస్తే జీవనోపాధి ఉండని పరిస్థితి తలెత్తడంతో.. చేసేది లేక కష్టాన్ని దిగమింగి, చెమటోడ్చి లోడింగ్ చేస్తున్నారు. ఇసుక లోడింగ్ చేసేందుకు కూలీలు యూనిట్‌కు రూ.500 వసూలు చేస్తుండగా, వాటిలోనే ర్యాంపు నిర్వహణకు, మరికొంత సొమ్ము కూటమి నేతలకు, అధికార యంత్రాంగానికి వాటాల రూపంలో అందిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన సొమ్ము లోడింగ్ చేసిన కూలీలు పంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ర్యాంపుల్లో కూలీల లోడింగ్ వద్దే కూటమి నేతల హడావుడి ఎక్కువైందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎక్కడా ఉచిత ఇసుక విధానం అమలు కావడం లేదనడంలో ఏమాత్రం సందేహం లేదు. శాండ్ కమిటీ నిర్ణయించిన ధరలు కన్నా, అధికంగానే డబ్బు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.



పెండ్యాలలో ట్రాక్టర్ నుంచి అక్రమంగా ఇసుక స్టాక్ చేస్తుండగా, లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న లారీ

క్లుప్తంగా

టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు



అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 14, 17, 19 విభాగాల్లో టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని ఏపీలాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్ ప్రారంభించారు. బాలురు, బాలికల జట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

= అండర్ 14 బాలికల విభాగంలో పి.లోచన (సామర్లకోట), ఎస్.మానవీదేవి (కాకినాడ), కె.తేజశ్రీ (రాజమహేంద్రవరం), ఎం.ధరణి (రాజమహేంద్రవరం), బి.తేజశ్రీ (కాకినాడ), బాలుర విభాగంలో కేఎస్ ప్రతీక్ (కాకినాడ), జి.నిఖిలేష్ (కాకినాడ), ఎన్‌టీఎస్‌టీ సుభాష్ (కాకినాడ), వై.ఇషాన్ (రాజమహేంద్రవరం), ఎన్.నాగచరణ్ (కాకినాడ), ఎస్‌వీవీ జోషి (రామహేంద్రవరం) ఎంపికయ్యారు.


- అండర్ 17 బాలుర విభాగంలో ఎన్.కృష్ణ సాహిత్ (కాకినాడ), ఎస్ఎండీ ఫైజల్ (రాజమహేంద్రవరం), బీకే కౌశిక్ (కాకినాడ), పి.లోకేష్ (కాకినాడ), ఎన్‌జేఎస్‌వీ నేత్ర (కాకినాడ), ఎస్.జైన్ (కాకినాడ)లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.శేషసాయి , జైన ఆయాన్ , డి. ఆశ్రిత , ఎస్ఎస్ అన్విత , సీహెచ్ఎల్వీ మనస్వి (కాకినాడ)లు ఎంపికయ్యారు.
- అండర్ 19 బాలుర విభాగంలో పీఆర్‌కే నీరజ్, ఎస్ఎస్ సాకేత్, ఆర్‌డీఎస్ తనిష్క, కేపీ కుమార్, పి.ప్రణవ్ కృష్ణ (కాకినాడ)ను ఎంపిక చేశారు., బాలికల విభాగంలో ఎం.మైత్రి లేఖన (కాకినాడ), కె.దేవి (పిఠాపురం), పి.పుష్పలత (చొల్లంగి), ఆర్ వీర శ్రావణి (చొల్లంగి), పీఎస్ఎల్ అభిజ్ఞ (కాకినాడ) ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30 తేదీలలో కాకినాడ డీఎస్ఏలో జరిగిన జరిగే రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ ఎస్‌జీఎఫ్ఐ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారు.

విద్యార్థిని మృతిపై కేసు

ఆలమూరు: అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) సమీపంలోని చెముడులంకలోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో పదోతరగతి చదువుతోంది. ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఒత్తిడి, వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తండ్రి బాబీ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండల విద్యాశాఖ స్పందించి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. డీవైఈఓ నరసింహ ఫణి మంగళవారం సాయంత్రం వెన్నెల మృతిపై విచారణ జరిపారు. సహచర విద్యార్థులను ప్రశ్నించి వివరాలను నమోదు చేసుకున్నారు.

భవితకు పునాది

- ఎఫ్ఎల్ఎన్ అమలుకు విద్యాశాఖ కసరత్తు
- 1, 2 తరగతుల విద్యార్థుల ప్రగతికి చర్యలు
- ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



ఎఫ్ఎల్ఎన్ లోగో

రాయవరం: ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తుంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటేనే అతడు అభ్యసనా సామర్థ్యాలను సులభంగా సాధిస్తాడు. అందుకే ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా చేపట్టాయి. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎన్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే డీఆర్పీలకు శిక్షణ ఇవ్వగా, ఇప్పుడు శిక్షణ పొందిన డీఆర్పీలు ఒకటో తరగతికి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

విద్యా సంస్కరణలు

నూతన విద్యా విధానం–2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ని ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ 1లో 3 నుంచి 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ 2లో 4 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు.

ఎఫ్ఎల్ఎన్ ఎందుకంటే..

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులకు కూడా తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు తెలియడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమం చేపట్టింది. విద్యార్థి 1, 2 తరగతులు పూర్తి చేసి మూడవ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలను సాధించాలి.

ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండు నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాలి.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బ్యాచ్‌ల వారీగా శిక్షణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒకటో తరగతి విద్యార్థులకు బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణకు తూర్పుగోదావరి జిల్లా కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలను శిక్షణా కేంద్రంగా రాష్ట్ర స్థాయి అధికారులు ఎంపిక చేశారు. మొదటి స్పెల్‌లో 90 మంది ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. జిల్లాకు చెందిన 1,285 మంది ఉపాధ్యాయులకు 14 బ్యాచ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నారు. గతేడాది ఆగస్టులో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానప్రకాష్ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందిన డీఆర్పీలు, కేఆర్పీలు ఒకటవ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆగస్టులో జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలుగా శిక్షణ పొందారు. వారిని బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చేందుకు పంపిస్తారు.

సద్వినియోగం



ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీలో భాగంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటాం. ఒకటవ తరగతి విద్యార్థికి పునాది చాలా అవసరం. ఆ సమయంలోనే చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలను తెలియజేయాలి. వీటి కోసం ఈ శిక్షణ చాలా ఉపయోగ పడుతుంది.

– జోస్యుల రాధాకృష్ణవేణి, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపీయూపీ స్కూల్, లొల్ల, రాయవరం మండలం

చాలా కీలకం



ఎనిమిది సంవత్సరాలు వచ్చే సరికి పిల్లల్లో ప్రాథమిక విద్యకు పునాది పడాలి. ఆ సమయమే వారి పెరుగుదల, అభివృద్ధికి చాలా కీలకం. దానివల్ల చిన్నారుల భవిష్యత్తు అభ్యసనానికి పునాది ఏర్పడుతుంది. శిక్షణలో తెలుసుకున్న విషయాలను పిల్లలకు బోధించడం వల్ల వారి ప్రగతికి బాటలు పడతాయి.

– గుబ్బల దుర్గాప్రసాద్, డీఆర్పీ, మలికిపురం మండలం

ఉపాధ్యాయులకు శిక్షణ



గతేడాది ఆగస్టులోనే జ్ఞాన ప్రకాష్, జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్‌లో భాగంగా మండలానికి ఆరుగురు డీఆర్పీలకు శిక్షణనిచ్చాం. ఇప్పుడు ఒకటవ తరగతి బోధన చేసే ప్రతి ఉపాధ్యాయుడికి శిక్షణనిస్తున్నాం. శిక్షణను సద్వినియోగం చేసుకుంటే పునాది అభ్యసనం మెరుగవుతుంది.

– అరవ ప్రభాకర్, శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు, విజయవాడ

బోధనకు ఉపయోగం



ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుంది. బ్యాచ్‌కు 250 మంది ఎస్‌జీటీలకు శిక్షణ ఇస్తున్నాం. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. కచ్చితంగా ఈ శిక్షణ ఉపాధ్యాయులకు బోధనలో ఉపకరిస్తుంది.

– గౌరీ శంకర్, ఏఎంవో, తూర్పుగోదావరి జిల్లా

మరణంలోనూ ఒకరికొకరు

- అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలే కారణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



రాంబాబు, నాగమణి దంపతులు (ఫైల్)



నాగమణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: అంబాజీపేట పెద్దవీధిలో ఉంటున్న పాబోలు రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) (60), నాగమణి (57) దంపతులు మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక సమస్యలు, అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో చనిపోతున్నామని సూసైట్ రాశారు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు, నాగమణి దంపతులు వారి రెండో కుమార్తె వంకాయల సునీత, మనవరాలు మానసతో కలిసి ఉంటున్నారు. సునీత, మానస రెండు రోజుల క్రితం బంధువు పెళ్లికి విశాఖపట్నం వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో రాంబాబు దంపతులు ఆత్మహత్యకు చేసుకున్నారు. సుబ్రహ్మణ్యం మేడ కింద మెట్ల వద్ద ఉరి వేసుకోగా, నాగమణి మంచంపై అచేతనంగా పడి ఉన్నారు. సమీపంలోని బంధువులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వ్యాపారంలో నష్టాలు

రాంబాబు గతంలో స్థానిక బేతాళ స్వామి గుడి సమీపంలోనూ, అయినవిల్లి మండలం సిరిపల్లి వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరి నూనె, పామాయిల్ వ్యాపారం చేసేవారు. వాటితో పాటు అంబాజీపేట మండలం కముజువారి లంక వద్ద పామాయిల్ నర్సరీని నిర్వహించేవారు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అన్నీ విక్రయించేశారు. ఏడేళ్లుగా ఆదిత్య గార్మెంట్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. దీనిలోనూ నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పదేళ్ల క్రితం కుమారుడి కుటుంబం ఆత్మహత్య

రాంబాబు దంపతుల కుమారుడు కిరణ్, కోడలు లక్ష్మీ శ్వేత, మనువరాలు శ్రావణి, తొమ్మిది నెలల మనవడు పదేళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి దంపతులిద్దరూ మనోవేదనతో గడుపుతున్నారు. కరోనా అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి.

మీ కూతుళ్లుగా చూసుకోండి

తన కుమార్తె సునీత, మనవరాలు మానసలను ఏలోటు లేకుండా చూసుకోవాలని తన తమ్ముళ్లయిన కృష్ణ, శ్రీనులను రాంబాబు సూసైట్ నోట్‌లో కోరారు. తమకు వారు ఎన్నో సేవలు చేశారన్నారు. తాను, తన భార్య ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్నారు. కాగా.. విషయం తెలిసిన వెంటనే నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, అంబాజీపేట పోలీస్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. రాంబాబు రాసిన సూసైడ్ నోట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు. మృతదేహాలను అమలాపురం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ తనిఖీలు

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ (లిక్కర్ ఫ్యాక్టరీ)లో వైజాగ్ నుంచి వచ్చిన సీఐడీ డీఎస్పీ నాగేంద్ర భూపాల్ ఆధ్వర్యంలో సీఐడీ, ఎక్సైజ్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి పరిశ్రమలో సోదాలు కొనసాగుతున్నాయి. అధికారులు పలు కీలక, హార్డ్ డిస్కులు, ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ బీరుతో పాటు ఆల్కాహాలు కూడా తయారు చేస్తున్నారు. అయితే దీనిపై మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

రాయవరం: ట్రాక్టర్ ఢీకొని పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన బాల సుబ్రహ్మణ్యం (21) మృతి చెందాడు. వెల్డింగ్ పనులు చేసుకునే బాలసుబ్రహ్మణ్యం మంగళవారం తెల్లవారుజామున టిఫిన్ తినేందుకు రామచంద్రపురం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా వెదురుపాక నుంచి పశువుల వ్యర్థాలతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఎస్సై పి.బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- 110 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విద్యాసాగర్

ఆలమూరు: రాష్ట్రంలోని వివిధ జిల్లాలో చోరీలకు పాల్పడుతూ ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర జిల్లా దొంగలు ఎట్టకేలకు చిక్కారు. వారు ఇప్పటి వరకూ చేసిన చోరీల సొత్తును రికవరీ చేసేందుకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ నేతృత్వంలోని పోలీసులు చర్యలు చేపట్టారు. ఆలమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ వివరాలు వెల్లడించారు. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు నెల రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య సీతను వైద్యం కోసం హైదరాబాద్ తీసుకువెళ్లారు. అక్కడే తన పెద్ద కుమార్తె ఇంటిలో ఉంటూ ఆమెకు వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న మెయిన్ రోడ్డు సమీపంలోని సోమరాజు నివాసానికి రోజూ మాదిరిగానే పనిచేసే మహిళ వచ్చింది. కానీ ఆ ఇంటి తలుపులు తెరిచి ఉండడం, వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో హైదరాబాద్‌లోని సోమరాజుకు సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్న సోమరాజు, కుటుంబ సభ్యులు ఇంట్లోని వస్తువులన్నీ పరిశీలించారు. బీరువాలోని సుమారు రూ.23 లక్షల విలువైన 312 బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు.

పోలీసుల దర్యాప్తు

బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరాజు ఆదేశాల మేరకు సీఐ విద్యాసాగర్ దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఐడీ పార్టీ సహకారంతో గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటికే 60కి పైగా కేసులున్న పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని గుడుపూడికి చెందిన పందిరి వెంకట నారాయణ (నారిగాడు), 25కు పైగా కేసులున్న నెల్లూరులోని కోటమెట్ట షాదీ మందిర్‌కు చెందిన షేక్ అహ్మద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ప్రస్తుతం రూ 7.7 లక్షల విలువైన 110 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారాన్ని నెల్లూరులో ఒక ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు నిందితులు తెలిపారు. నిందితులిద్దరిని బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచి కస్టడీకి కోరనున్నట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చోరీ కేసు చేధనలో తీవ్రంగా శ్రమించిన డి.సుబ్రహ్మణ్యం, ఎస్.బ్లేసమ్, పి.గంగాధర్, కె.రాంబాబు, బి.నెహ్రూ, బి.శ్రీనివాసరావు, కేవీవీ రవికుమార్, వి.చిట్టిబాబును సీఐ విద్యాసాగర్ అభినందించారు.



ఆలమూరులో విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కమనీయం.. బ్రహ్మోత్సవం



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. సరస్వతి అలంకరణలో హంస వాహనంపై స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, హోమాలు జరిపారు. భద్రాచలంలోని సీతారామస్వామి ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈఓ దంపతులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు